క్లుప్తంగా

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ ఏ వీఎస్కే ప్రసాద్ , హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం సూచించారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణకు వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆయుర్వేదం, హోమియో చికిత్స ద్వారా అన్ని రకాల వ్యాధులను ఎటువంటి సైడు ఎఫెక్టులు లేకుండా నయం చేయవచ్చని తెలిపారు. అనంతరం 250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమాలను ట్రస్ట్ సభ్యులు పర్యవేక్షించారు.

చెస్ టోర్నమెంట్‌లో గీతిక ప్రతిభ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 17 నుంచి 21 వరకూ తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఆలిండియా ఫిడే ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో సింగ్‌నగర్ రామకృష్ణ చెస్ అకాడమీకి చెందిన విద్యార్థిని పూడి గీతిక అత్యుత్తమ ప్రతిభను కనబర్చింది. అండర్-9ఎఫ్ కేటగిరిలో మొదటిస్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా చెస్ కోచ్ రామకృష్ణ, విద్యార్థిని చదువుతున్న సత్యనారాయణపురం రవీంద్రభారతి స్కూల్ అధ్యాపక బృందం ఆమెకు అభినందనలు తెలిపారు. గీతిక ఇలానే మరిన్ని పతకాలు సాధించి నగరానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కంప్యూటర్ శిక్షణతో ఉపాధి అవకాశాలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కంప్యూటర్ శిక్షణతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని డాక్టర్ నవ్య అన్నారు. గవర్నర్‌పేటలోని సన్ ఇన్ఫో టెక్నాలజీస్ ఇనిస్టిట్యూట్‌లో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. డాక్టర్ నవ్య మాట్లాడుతూ నిరుద్యోగ యువత కంప్యూటర్ శిక్షణ పొందితే ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణనందిస్తున్న నిర్వాహకులను ఆమె అభినందించారు. శిక్షణ కేంద్రం నిర్వాహకులు మంచెం శరత్ మాట్లాడుతూ ట్యాలీ, వెబ్ డిజైనింగ్, సి లాంగ్వేజ్, వంటి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పలువురు అభ్యర్థులు శిక్షణ పొంది ఉపాధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో శిక్షణ పొందిన అభ్యర్థులు, సంస్థ ట్రైనర్స్ పాల్గొన్నారు.

అల్లా జీవితం సర్వమానవాళి శ్రేయస్సుకు నిదర్శనం



ఆటోనగర్(విజయవాడతూర్పు): అల్లా జీవితం సర్వమానవాళి శ్రేయస్సుకు నిదర్శనమని సీరతున్న బీ వ ఇస్లాహ్ ముఆషిరా జమాతె ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ రఫీఖ్‌సాహెబ్ అన్నారు. విజయవాడలో ఆదివారం ఇమారతె షరయియ్యా ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుణ్యమూర్తి అంతిమ దైవ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి జీవితం మానవ మహోపకారి కోసం తెచ్చిన మహోన్నత విప్లవం అన్నారు. నాడు-నేడు ఆచరాణ్మాతక మార్గదర్శకత్వమని చెప్పారు. ప్రవక్త వారి మిషన్ ఆయన కారుణ్యపు కోణాలను ప్రజలకు చేరవేసే గురుతర బాధ్యత మిల్లత్‌పై ఉందన్నారు. కార్యక్రమంలో హబీబ్‌ఖాన్, ముస్లింలు పాల్గొన్నారు.

నగర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నగర ప్రజలకు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాలు శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, దుష్ట శక్తుల మీద దైవశక్తి అంతిమ విజయం సాధిస్తాయని.. మహిషాసురుడిపై దుర్గామాత విజయం ప్రపంచానికి చాటిందన్నారు. దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్రంలో సర్వమత సమానత్వం, సౌభ్రాతృత్వం వర్ధిల్లుతున్నాయని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో దేశంలోనే అత్యంత వేగంగా పురోగతి సాధిస్తుందని తెలిపారు. ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని కోరారు.

దుర్గాదేవీ నమోస్తుతే...



దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో దుర్గాదేవిగా అమ్మవారు



దావు బుచ్చయ్యకాలనీలో దుర్గాదేవిగా అమ్మవారు



ముత్యాలంపాడులో అమ్మవారు



రామలింగేశ్వరపేటలో అమ్మవారు



ఆంధ్రప్రభకాలనీలో మహిషాసురమర్ధినీ దేవీగా



రామకృష్ణాపురంలో దుర్గాదేవిగా అమ్మవారు



శివరామకృష్ణ క్షేత్రంలో దుర్గాదేవి



శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మ



న్యూఆర్‌ఆర్‌పేటలో.. భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న తోట శ్రీనివాస్



తెల్లపుష్పాలతో షిరిడీ సాయినాధుడు



గద్దే వెంకట్రామయ్యనగర్‌లో అమ్మవారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదోరోజు ఆదివారం అమ్మవారు శ్రీదుర్గాదేవి, మహిషాసుర మర్ధినీదేవిగా పూజలు అందుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన అమ్మవారిని దుర్గాదేవిగా అలంకారం చేసి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన, చండీ హోమం చేశారు. పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. బావాజీపేట నాలుగోలైనులో శ్రీదేవీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యాన అమ్మవారిని మహిషాసుర మర్ధినీదేవిగా అలంకరించి పూజలు చేశారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ట్రస్ట్ సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ దంపతులు అమ్మవారికి పూజలు చేశారు. 21 మంది కన్యలతో కుమారీ పూజ జరిగింది. దుర్గాపురంలో వీరమాచినేని లలిత ఆధ్వర్యాన అమ్మవారిని శ్రీ దుర్గాదేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు బోనాలు సమర్పించారు. మధురానగర్ నేతాజీకాలనీలోని శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారిని శ్రీ దుర్గాదేవిగా అలంకరించి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు. ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో అమ్మవారిని శ్రీ దుర్గాదేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు, విశేషంగా హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. మధురానగర్ మెయిన్ రోడ్డులో అమ్మవారిని మహిషాసుర మర్ధినీదేవిగా అలంకరించి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. రామకృష్ణాపురం దుర్గాదేవి



చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు



దుర్గాపురంలో బోనాలు సమర్పిస్తున్న భక్తులు

అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు. రామలింగేశ్వరపేట శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయం వద్ద ఆలయకమిటీ ఆధ్వర్యాన అమ్మవారిని మహిషాసురమర్ధిని దేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు తాన్న పూర్ణచంద్రరావు పర్యవేక్షించారు. గద్దే వెంకట్రామయ్యనగర్‌లో అమ్మవారిని మహిషాసుర మర్ధిని దేవిగా అలంకరించి పూజలు చేశారు. దావు బుచ్చయ్యకాలనీలో శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి విశేషంగా పూజలు అభిషేకాలు నిర్వహించారు. రెండు వేల మందికి అన్నదానం చేశారు. మధురానగర్ శ్రీబాల సుబ్రహ్మణ్య దేవాలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.



హోమం చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు

విజయవాడ సెంట్రల్: విశ్వమాతా చారిటబుల్ సంస్థ, సిద్ధేశ్వరానంద పీఠం ఆధ్వర్యంలో హనుమాన్‌పేట శంకరమఠంలో రాజరాజేశ్వరి అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చింది. వేదపండితులు నిడుమోలు రమా సత్యనారాయణ ఆధ్వర్యంలో చండీ హోమం, మహావిద్యాహోమం, శ్రీ మహాలక్ష్మి హోమం నిర్వహించారు. దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో బాలా త్రిపురసుందరిని దుర్గాదేవిగానూ, శారదాంబను రాజరాజేశ్వరిగానూ, మహాలక్ష్మిని ధైర్యలక్ష్మిగానూ అలంకరించారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో పార్వతీదేవిని కనకదుర్గగా అలంకరించారు. పండితులు రుద్రపారాయణ, నిర్వహించారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, ఆంధ్రప్రభకాలనీ, వాంబే కాలనీ పరిసర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎనిమిదో రోజు అమ్మవారు శ్రీదుర్గాదేవీగా.. పలుచోట్ల శ్రీమహిషాసురమర్ధిని దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. కుటుంబ సమేతంగా భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక 57డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలో నిర్వహిస్తున్న శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో శ్రీదుర్గాదేవీ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాంప్రదాయ ప్రకారం దుర్గాసప్తశతీ చండీ హోమం, లలితా సహస్రనామార్చనతో కుంకుమ పూజలు, సాయంత్రం పంచహారతులు, ప్రసాద వితరణలు నిర్వహించారు. శ్రీగణపతి యూనివర్సల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఐదు వేల మంది భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని శ్రీషిర్డీసాయి మందిరంలో వేంచేసి ఉన్న శ్రీకాశీ అన్నపూర్ణ అమ్మవారు శ్రీమహిషాసురమర్ధినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయి బాబా మందిరంలో షిర్డీ సాయినాధుని 105వ పుణ్యతిథి మహోత్సవాలు ఆదివారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. బాబావారికి విశేషంగా లఘున్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, పంచసూక్త పఠనం జరిగింది. క్షీరము వట్టివేర్లతో బాబాకు అభిషేకం చేసి తెల్లపుష్పాలతో లక్షనామార్చన చేశారు. లోక కళ్యాణార్థం మందిర కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు సాయినాథ, నవగ్రహ హోమం వేదపండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు.



అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారు



హోమం చేస్తున్న అవ్వా హేమసుందర వరప్రసాద్



బావాజీపేటలో కుమారీ పూజలో బచ్చుమాధవీకృష్ణ దంపతులు

పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

ఉత్సాహంగా దాండియా నైట్



దాండియా ఆడుతున్న మహిళలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని రోటరీ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో దాండియా నైట్ ఉత్సాహంగా జరిగింది. వేగా జ్యువెలర్స్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. తొలుత రోటరీ సభ్యులతో కలిసి దుర్గాదేవి పూజ నిర్వహించారు. అనంతరం దాండియా, ఫ్యాషన్ షో నిర్వహించారు. మన సంస్కృతీ, సాంప్రదాయాలకు విలువనిస్తూ, ప్రతి ఏటా దాండియా నిర్వహిస్తున్నట్లు రోటరీ మిడ్‌టౌన్ అధ్యక్షుడు సాధుప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా దాండియా కింగ్, దాండియా క్వీన్, గర్బారాజు, గర్బారాణీలుగా విజేతలను ప్రకటించి బహుమతులు అందజేశారు.

నేత్ర పర్వంగా కూచిపూడి నృత్యాలు



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న రవిబాల కృష్ణ బృందం

విజయవాడ కల్చరల్: దసరా మహోత్సవాల సందర్భంగా కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సత్యనారాయణపురం సీతారామా కల్యాణ మండపంలో ఆదివారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ చింతా రవిబాల కృష్ణ బృందం మోహినీ భస్మాసుర, గోవర్ధనగిరిధారి, వసుదైవ సుతం, సీతా స్వయం వచ్చెను అలివేలుమంగ, రఘుకులనాయకా, ధిల్లానా అంశాలను మనోహరంగా ప్రదర్శించారు. కుప్పా కృష్ణవేణి, యోచిత డాన్స్ కేంద్రం, సీహెచ్ అజయ్‌కుమార్ బృందం సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు.

గురుకుల పాఠశాలల రూపశిల్పి ఎస్.ఆర్.శంకరన్



ఎస్ ఆర్ శంకరన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): పేద, బడుగు, బలహీన వర్గాల విద్యాభివృద్ధికి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు నెలకొల్పిన రూపశిల్పి ఎస్ ఆర్ శంకరన్ అని డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను అన్నారు. విజయవాడ గాంధీనగర్ లోని రాష్ట్ర డెమొక్రటిక్ పీఆర్టీయూ కార్యాలయంలో ఆదివారం మాజీ ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్ శంకరన్ జయంతి నిర్వహించారు. తొలుత ఉపాధ్యాయులు శంకరన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీపుల్స్ ఆఫీసర్‌గా ఎస్ ఆర్ శంకరన్ పేరు పొందారన్నారు. గురుకుల పాఠశాలల కోసం విశేష కృషి చేశారన్నారు. ప్రజా సేవలో తన దైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. సాంఘిక, సంక్షేమ, గురుకుల పాఠశాల బలోపేతానికి ఎస్.ఆర్ శంకరన్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను కోరారు. నీలిమా దేవి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ అబ్రహాం లింకన్, డెమొక్రటిక్ పీఆర్టీయూ నేతలు జ్ఞానేశర్ రావు, శ్రీనివాస్ రావు, ప్రభాకర్ రావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు



నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

విజయవాడకల్చరల్: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో కనకదుర్గానగర్‌లోని కళావేదికపై నిర్వహిస్తున్న కళా ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం నాటి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు కనకదుర్గ వైభవాన్ని చాటుతూ నృత్యాలను ప్రదర్శించారు. భాగవతుల సౌమ్య తన బృందంతో జయదుర్గే శ్రీ దుర్గే, ఆయగిరి నందిని నందిత మోహిని అంశాలను నేత్రపర్వంగా ప్రదర్శించారు. ఎం.సాయి మంజూష, ఎంవీఎస్ఎస్ఆర్ నాగచంద్రిక, ఎన్ సత్యనిజ, జి.తనిష్క్రీ, వై.మానస, జి.శ్రీనివాస్, టి.మీనాక్షి, అన్నమయ్య, త్యాగరాజు, రామదాసు కీర్తనలకు నృత్యాలను అభినయించారు. హనుమాన్ జంక్షన్‌కు చెందిన టి.నాగేశ్వరరావు భక్తి గీతాలను, అక్షర వీణపై త్యాగరాజ కృతులను, తెనాలికి చెందిన అనూరాధ శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహించారు. కార్యక్రమాన్ని సైదా, గంగాధర్, రామకృష్ణ నిర్వహించారు. కళాకారులకు నిర్వాహకులు అమ్మవారి లడ్డూప్రసాదాన్ని, ప్రశంసా పత్రాలను అందజేశారు. సోమవారంతో సాంస్కృతిక కార్యక్రమాలు ముగుస్తాయని నిర్వాహకుడు గంగాధర్ తెలిపారు.

వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలి



రుగ్వేదం పారాయణం చేస్తున్న వేద పండితులు

విజయవాడకల్చరల్: వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలని విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ ఘనాపాటి అన్నారు. కృష్ణా మండల వేద విద్వత్ సభ దసరా మహోత్సవాలు, శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా లబ్బీపేట శ్రీ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాయలంలో ఆదివారం చతుర్వేద సభను నిర్వహించారు. వేద సభను ప్రాంభించిన లక్ష్మీనారాయణ ఘనాపాటి మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 200 మంది వేద పండితులు సామవేదం, అధ్వర్వణవేదం, యజుర్వేదం, రుగ్వేదం పారాయణం చేశారు. వేద పండితులను మాగంటి వేణుగోపాలశర్మ ఘనంగా సత్కరించారు. మేనేజర్ శర్మ, పాలకమండలి సభ్యుడు ఎ.ప్రభాకర్ శర్మ పాల్గొన్నారు.

గంగానమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ

విజయవాడరూరల్: విలేజి కండ్రికలో గంగానమ్మ గుడి నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా గంగానమ్మకు గ్రామస్తులు పూజలు చేస్తున్నారు. గంగానమ్మకు గుడి నిర్మించాలనే తలంపుతో భూమిపూజ కార్యక్రమాన్ని తలపెట్టారు. వేద పండితులు మంత్రాలు చదువగా దేవిరెడ్డి హరినారాయణరెడ్డి, కవిత దంపతులు పీటలపై కూర్చున్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నగర ప్రధాన కార్యదర్శి యరగొర్ల శ్రీరాములు, కండ్రిక సొసైటీ చైర్మన్ మూళగొళ్ళ రవీంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు పిన్నిబోయిన కృష్ణ, దేవిరెడ్డి కిరణ్‌రెడ్డి, వీరయ్య పాల్గొన్నారు.

బాలుడి ఆపరేషన్‌కు ఆర్థిక సాయం



హర్షిత్ తల్లికి నగదు అందిస్తున్న పోలీసులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్యాంక్రియాస్, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సింగినగర్‌కు చెందిన 12 సంవత్సరాల బాలుడు హర్షిత్ ఆపరేషన్‌కు నగర పోలీసులు రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగించే హర్షిత్ తండ్రి రమేష్ పడుతున్న ఇబ్బందులను గుర్తించిన దీవెన ఫౌండేషన్ ద్వారా సాయం అందించారు. ఫౌండేషన్ సభ్యులు త్రీ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ, సింగ్‌నగర్ కానిస్టేబుల్ చందు బాబు పాల్గొన్నారు.







